"మీ గ్రామస్థులంతా పరమ దుర్మార్గులు. మీరు నాశనం అవుగాక." శాపనార్థాలు పెట్టాడు శిష్యుడు.

గ్రామంలోంచి బయటకి వచ్చాక తన గురువు బాధపడుతూండటం చూసి, జరిగిందానికి ఇంకా ఎక్కువ బాధపడే శిష్యుడు అనునయంగా చెప్పాడు.

"బాధపడకండి గురువు గారు. ఈ గ్రామస్థులు సంస్కారవంతులు కారు. పైగా మూర్ఖులు."

"నేను బాధపడేది వాళ్ళ గురించి కాదు. నువ్వు నా దగ్గర ఇంతకాలంగా ఉండీ, నా బోధనలని వినీ, ఇంకా సాధుత్వం అలవరచుకోనందుకు బాధ పడుతున్నాను." చెప్పాడు సంచార గురువు.

## 20. పాఠం

ఓ తండ్రీ కొడుకులిద్దరూ ఒకరికి మించిన లోభులు మరొకరు. ఇతరులకి సహాయం చేయడం లాంటి దైవీ గుణాలు వారిద్దరిలో లేవు. ఓరోజు వాళ్ళింటికి భిక్షకి ఓ సన్న్యాసి వెళ్తూంటే వూళ్ళోవాళ్ళు ఆయన్ని వాళ్ళింటికి వెళ్ళద్దని, ఆ తండ్రీ కొడుకుల లోభత్వం గురించి చెప్పారు. అతను వాళ్ళ ఇంటి ముందు ఆగి తాగడానికి కాసిన్ని మంచినీళ్ళు ఇవ్వమని కోరితే 'చెఱువు దగ్గరకి వెళ్ళి తాగు' అన్నాడు తండ్రి.

సన్న్యాసి కొడుకుని పిలిచి చెప్పాడు.

"మరో మూడు రోజుల్లో నీ తండ్రి మరణిస్తాడు. అతన్ని కాల్చాక నువ్వు నీ తండ్రి పుర్రెని తీసుకుని దాన్ని పాత్రగా చేసుకుని అందులో డబ్బు దాచుకో. బాగు పడతావు."

అ సన్న్యాసి చెప్పినట్లే తండ్రి మూడో రోజు మరణించాడు. దాంతో సన్న్యాసి మాటల్లో నమ్మకం కుదిరిన కొడుకు తండ్రి పుర్రెని తెచ్చుకుని దాన్ని శుభ్రం చేసి డబ్బులుంచుకునే పాత్రగా చేసుకుని వాడుకోసాగాడు. దాంట్లో డబ్బు వేయడమే తప్ప లోభి కాబట్టి కొడుకు డబ్బుని తీసేవాడు కాదు. ఐతే ఎంత డబ్బు వేసినా ఆ పుర్రె పాత్ర నిండకపోవడం కొద్ది కాలంలో కొడుకు గుర్తించాడు.

అతనికి ఎంతో ఆశ్చర్యం వేసింది. ఓ రోజు ఆ కొడుక్కి ఆ సన్న్యాసి చెరువు ఒడ్డున ధ్యానం చేసుకుంటూ కనిపించాడు. వెంటనే కొడుకు అతన్ని ప్రశ్నించాడు.

“మీరు చెప్పినట్లుగానే చేసాను. మా నాన్న పుర్రెలో ఎంత డబ్బు వేసినా అదెందుకు నిండటం లేదు?”

“అది ఓ దురాశాపరుడైన లోభి పుర్రె కాబట్టి అందులో ఎంత డబ్బు వేసినా సరిపోదు. నువ్వు అంతకు మించిన లోభివి కాబట్టి అందులోంచి తీసి వుండవు. ఇంటికి వెళ్ళి తీసి చూడు. ఏమవుతుందో తెలుస్తుంది.”

కొడుకు ఇంటికి వెళ్ళి పుర్రె లోంచి ఓ నాణెం తీయడానికి ప్రయత్నిస్తే ఒక్కటీ బయటికి రాలేదు.

అంతులేని ఆశతో అవసరమైన దానికంటె ఎక్కువ వెనకేసుకోవడం మంచిది కాదన్న పాఠాన్ని అర్థం చేసుకున్న ఆ కొడుకు, తన లోభత్వాన్ని చంపుకుని లేనివారికి సహాయం చేయడం నేర్చుకున్నాడు.

## 21. దాన కర్ణుడు

కర్ణుడి దాతృత్వం గురించి ఎవరో పొగుడుతూంటే అర్జునుడు దాన్ని విని సహించలేక పోయాడు. పక్కనే ఉన్న శ్రీకృష్ణుడు అది గ్రహించి అర్జునుడికి తగిన గుణపాఠం నేర్పాలనుకున్నాడు. మర్నాడు అర్జునుడ్ని తన ఇంటికి భోజనానికి ఆహ్వానించాడు. అతనికో చిన్న బంగారు పాత్రని ఇచ్చి చెప్పాడు.

“దీన్లో బంగారు నాణాలున్నాయి. వస్తూ, వస్తూ వాటిని త్వరగా దానం చేసిరా. ఎందుకంటే కర్ణుడ్ని కూడా భోజనానికి పిలిచాను. నీవల్ల అతనికి భోజనం వడ్డించడం ఆలస్యం చేయడం బావుండదు.”

మర్నాడు అర్జునుడు కృష్ణుడి ఇంటికి బయలుదేరాడు. దారిలో నగర కూడలిలో కూర్చుని వచ్చేపోయే వారిని పిలిచి ఆ బంగారు గిన్నెలోని నాణాలని దానం చెయ్యసాగాడు. త్వరలోనే అర్జునుడి ముందు చాలామంది గుమిగూడి వాటిని స్వీకరించసాగారు. అర్జునుడు ఎందరికి దానం చేసినా ఆ పాత్రలోని నాణాలు తరగటం లేదని గ్రహించాడు. ఎంత వేగంగా అతను నాణాలని